సాక్షి

పార్వతీపురం మన్యం

శనివారం । 24 । జూన్ । 2023



పౌల్ట్రీలకు ఎదురు దెబ్బ

ఈ ఏడాది వేసవి ఎండలతో పౌల్ట్రీ పరిశ్రమ విలవిలలాడింది. నష్టాలు పూడ్చుకునేందుకు ధరలను పెంచింది. - 10లో



25న ఒలింపిక్ డే రన్

అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న విజయనగరం జిల్లా కేంద్రంలో 2కే రన్ నిర్వహిస్తామని సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. - 10లో



గజరాజులను కవ్వించొద్దు

కొమరాడ మండలం దుగ్గి గ్రామంలో ఎనిమిది ఏనుగులు సంచరిస్తున్నాయి. వాటిని కవ్వించవద్దని అటవీశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. - 10లో

న్యూస్‌రీల్

జీసీసీ స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన పీఓ



కురుపాంలోని జీసీసీ స్టాక్‌పాయింట్‌ను పరిశీలిస్తున్న పీఓ విష్ణుచరణ్

కురుపాం: మండల కేంద్రంలోని జీసీసీ స్టాక్ పాయింట్‌ను పార్వతీపురం ఐటీడీఏ పీఓ విష్ణు చరణ్ శుక్రవారం పరిశీలించారు. బియ్యం నిల్వలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతినెలా సకాలంలో రేషన్ దుకాణాలు, డీఆర్ డిపోలకు సక్రమంగా నిత్యావసర సరుకులు సరఫరా చేయాలని, ఏజెన్సీలో ఏ ఒక్క రేషన్ కార్డు లబ్ధిదారునికి ఇబ్బంది లేకుండా చూడాలని జీసీసీ డివిజనల్ మేనేజర్ మహేంద్రకుమార్‌ను ఆదేశించారు. జూలై నెల నుంచి కురుపాం, జి.ఎల్.పురం, సాలూరు, ఎంఎల్ ఎస్ పాయింట్స్ నుంచి స్టేజ్–2 ట్రాన్స్‌పోర్ట్‌కు జీసీసీ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయన వెంట బ్రాంచ్ మేనేజర్ కృష్ణప్రసాద్, కురుపా ఎంఎల్ఎస్ ఇన్‌చార్జ్ బంగార్రాజు, గుమ్మలక్ష్మీపురం ఎంఎల్ఎస్ సూపరింటెండెంట్ ఎమ్.సాంబశివరావు ఉన్నారు.

కౌన్సెలింగ్‌కు 570 మంది హాజరు



కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

విజయనగరం పూల్‌బాగ్: కాంట్రాక్టు పద్ధతిలో మినిమమ్ టైమ్ స్కేల్‌కు ఎస్జీటీలుగా నియమించబడిన డీఎస్సీ–2008, 1998 అభ్యర్థులకు అనుకూలమైన స్కూల్స్‌లో పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చేందుకు శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. విజయనగరం రింగ్‌రోడ్డులోని పీఎస్ఆర్ స్కూల్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 570 మంది హాజరైనట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు.

జోగింపేట కేజీబీవీ సందర్శన



జోగింపేట కేజీబీవీ పరిసరాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అధికారి సురేష్‌కుమార్

సీతానగరం: మండలంలోని జోగింపేట కేజీబీవీను పాఠశాల విద్యాశాఖ కమిషనర్, నవరత్నాలు, జగనన్న సురక్ష జిల్లా ప్రత్యేకాధికారి ఎస్.సురేష్‌కుమార్ శుక్రవారం సందర్శించారు. జగనన్న విద్యాకానుకల పంపిణీ, పాఠశాల పరిసరాల పరిశుభ్రత, విద్యాబోధన తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జేవీకే కిట్ల నాణ్యతపై విద్యార్థులను ప్రశ్నించారు. గతేడాది అమ్మఒడి డబ్బులు అందరికీ అందాయా లేదా అని ఆరాతీయగా, అందరికీ అందినట్లు తెలిపారు. ప్రమాణాలతో కూడిన విద్యాబోధనతో ఉత్తమ ఫలితాలు సాధించాలని టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో డీఈఓ ఎన్. ప్రేమ్‌కుమార్, జీసీడీఓ కె.రోజారమణి, సెక్టోరియల్ అధికారులతో పాటు మండల విద్యాశాఖాధికారులు సూరిదేముడు, ఎం.వెంకటరమణ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ జె.సంధ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ దీపికా పాటిల్

గంట్యాడ: నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా పెట్టాలని ఎస్పీ దీపికా పాటిల్ పోలీసు అధికారులకు సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. స్టేషన్ ప్రాంగణం, ప్రాపర్టీగది, రికార్డులను పరిశీలించారు. కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, ఫిర్యాదు చేయడానికి వచ్చే వారితో స్నేహపూర్వకంగా మెలగాలని, వారి సమస్యలను ఓపిగ్గా తెలుసుకునివాటి పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. గ్రామాల్లో వివాదాలు లేకుండా ప్రజలంతా కలసిమెలిసి ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సీఐ తిరుపతిరావు, ఎస్ఐ కిరణ్ కుమార్‌నాయుడు ఎస్పీ వెంట ఉన్నారు.

విద్యార్థులు, వృద్ధుల్లో.. నేత్రానందం



- వైఎస్సార్ కంటి వెలుగు కింద ఊరూరా వైద్య శిబిరాలు
- నేత్ర సమస్యలతో బాధపడుతున్నవారికి ఉచిత వైద్య పరీక్షలు
- అవసరమైన వారికి శస్త్రచికిత్సలు
- కళ్లద్దాల పంపిణీ
- జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు సేవలపై ప్రశంసల జల్లు



వృద్ధురాలికి నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: మానవ శరీరంలోని జ్ఞానేంద్రియాల్లో నేత్రాల పాత్ర కీలకం. చూపు మందగిస్తే అడుగు ముందుకు పడదు. విద్యార్థుల్లో అయితే చదువుకు ఆటంకం కలుగుతుంది. భవిష్యత్తు అంధకారమయ్యే ప్రమాదం ఉంది. వీటి నుంచి విద్యార్థులు, అవ్వాతాతలను బయటపడేందుకు జగన్‌మోహన్ రెడ్డి సర్కారు పూనుకుంది. వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద నాలుగేళ్లుగా ఊరూరా, విద్యాలయాల్లో ఉచిత నేత్ర వైద్యశిబిరాలు నిర్వహిస్తోంది. నేత్ర సమస్యలతో బాధపడేవారికి ఉపశమనం కలిగించే యజ్ఞాన్ని నిర్విరామంగా కొనసాగిస్తోంది. కంటికి వెలుగు దారి 'చూపు'తోంది.

వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మొదటి, రెండు విడతల్లో పాఠశాలల్లో ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేశారు. కళ్లద్దాలను పంపిణీ చేశారు. ప్రస్తుతం సాగుతున్న మూడో విడతలో అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్య పరీక్షల కోసం అవ్వతాతలు ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఊరిలోని వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి పైసా ఖర్చులేకుండా ప్రభుత్వమే జిల్లా కేంద్రాస్పత్రి, పుష్పగిరి కంటి ఆస్పత్రి, విశాఖశంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, పి.ఎల్.సాలూరు ఆస్పత్రులకు తీసుకెళ్లి చేయిస్తోంది.

వైఎస్సార్ కంటి వెలుగు కింద సేవలు ఇలా..

ఫేజ్–1లో 2,92,462 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు
ఫేజ్–2లో 13,109 మంది విద్యార్థులకు పరీక్షలు
ఫేజ్ –3లో ఇప్పటివరకు 1,79,890 మంది అవ్వాతాతలకు నేత్ర పరీక్షలు
వీరిలో 28,213 మందికి శస్త్రచికిత్సలు
43,938 మంది అవ్వతాతలకు కళ్లద్దాల పంపిణీ

నాటి నుంచి నేటి వరకు...

- డా.వైయస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా తొలివిడతలో 2019 అక్టోబర్ 10 నుంచి 16వ తేదీ వరకు జిల్లాలోని 3,357 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు నిర్వహించారు. 3,03,717 మంది విద్యార్థుల్లో 2,92,462 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 2,79,471 మందికి సాధారణ కంటి చూపు ఉండగా, 13,109 మందికి కంటి సమస్యలు ఉన్నట్టు గుర్తించారు.
- రెండో విడత 2019 నవంబర్ ఒకటో తేదీ నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు రెండు నెలలు పాటు కంటి పరీక్షలు నిర్వహించారు. 13,109 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 8,901 మందికి సాధారణ కంటి చూపు ఉన్నట్టు నిర్ధారించారు. 3,844 మందికి కళ్లద్దాలు అందజేశారు. 18 మందికి మెల్ల కన్ను శస్త్రచికిత్సలు, ఐదుగురికి శుక్లం శస్త్ర చికిత్సలు, 20 మందికి రెప్పవాలటం సమస్యకు శస్త్రచికిత్సలు చేశారు.
- మూడో విడత కంటి వెలుగు కార్యక్రమం 2020 ఫిబ్రవరి 18 నుంచి ప్రారంభమైంది. కోవిడ్ కారణంగా కొంత కాలం కంటి పరీక్షలు చేయడం నిలిపివేశారు. మళ్లీ మే 27, 2021 నుంచి కంటి పరీక్షలు పునః ప్రారంభించి నిరంతరాయంగా కొనసాగిస్తున్నారు. మూడో విడతలో ఇప్పటి వరకు 1,79,890 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో కంటి శుక్లం వ్యాధితో 19,780 మంది బాధపడుతున్నట్టు గుర్తించారు. 28,213 మందికి శస్త్రచికిత్సలు చేశారు. 50,498 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించగా ఇప్పటి వరకు 43,938 మందికి ఉచితంగా అందజేశారు.

కళ్లద్దాలతో చూపుతెచ్చారు



నా పేరు వేచలపు సూరిదేముడు. మాది గంట్యాడ మండలం పెదవేమలి గ్రామం. గత రెండు సంవత్సరాల నుంచి చూపు మందగించింది. అక్షరాలు, దూరంగా ఉన్న వారు సరిగా కనిపించేవారు కాదు. మా గ్రామంలో వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం కింద ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అక్కడ వైద్యపరీక్షలు చేసిన వైద్యులు కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. ఉచితంగానే కళ్లద్దాలు ఇచ్చారు. ఇప్పుడు నాకు చూపు చాలా బాగుంది.



నా పేరు సిరపురపు రామారావు. మాది కోరుకొండపాలేం గ్రామం. విజయనగరం మండలం. నాకు సంవత్సరం నుంచి ఒక కన్ను కనిపించడం లేదు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మా గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. నా కుడి కన్నుకు ఆపరేషన్ చేశారు. నాకు చూపు బాగా కనబడుతోంది. నాకు ఉచితంగా ఆపరేషన్ చేయించినందుకు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

కంటికి వెలుగు

వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం అవ్వాతాతల్లో వెలుగులు నింపుతోంది. ఇప్పటికే ఫేజ్–1, 2లో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించాం. ప్రస్తుతం ఫేజ్–3 నడుస్తోంది. ఫేజ్–3లో 1,79,890 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించాం. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు, కళ్లద్దాలు పంపిణీ చేస్తున్నాం. గతంలో ఎన్నడూ ఇంత స్థాయిలో నేత్ర సమస్యలపై వైద్యశిబిరాలు నిర్వహించలేదు.

– డాక్టర్ బి.శివప్రసాద్, జిల్లా అంధత్వ నివారణ అధికారి

మ్ముఖ్యమంత్రి సభాప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు, అధికారులు



28న కురుపాంకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి



పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్ బృందం

- సభాస్థలాన్ని పరిశీలించిన పాలకులు, అధికారులు
- ఏర్పాట్లపై సూచనలిచ్చిన సీఎం కార్యక్రమ సమన్వయకర్త తలశిల రఘురాం
- పాల్గొన్న జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, అధికారులు

కురుపాం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28వ తేదీన పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం నియోజకవర్గ కేంద్రంలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా సభాస్థలి, హెలిప్యాడ్ స్థలాలను శాసనమండలి సభ్యుడు, ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కురుపాం, పార్వతీపురం ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ తదితరులు శుక్రవారం పరిశీలించారు. నాలుగో ఏడాది జగనన్న అమ్మఒడి నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేసే బృహత్తర కార్యక్రమానికి కురుపాం వేదికగా ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో భాగంగా సీఎం రాకకు వీలుగా జియ్యమ్మవలస మండలం చినమేరంగి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో హెలిప్యాడ్, కురుపాం నుంచి చినమేరంగి వెళ్లే రహదారి సమీపంలోని సెయింట్ మాంట్ ఫోర్ట్ పాఠశాలకు ఆనుకొని ఉన్న స్థలంలో బహిరంగ సభావేదికను ఏర్పాటుచేయాలని అధికారులు నిర్ణయించారు.

జిల్లాకు మొట్టమొదటిసారిగా ముఖ్యమంత్రి వస్తున్న నేపథ్యంలో పెద్దఎత్తున ప్రజలు తరలి వస్తారనే ఆలోచనతో భారీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు ప్రజాప్రతినిధులు సూచించారు. హెలిప్యాడ్, సభాస్థలి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. సభకు వచ్చే వాహనాలకు పార్కింగ్ సౌకర్యం, పారిశుద్ధ్యం నిర్వహణ అంశాలపై దృష్టిసారించాలన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏ పీఓలు సి.విష్ణుచరణ్, కల్పనాకుమారి, డీఆర్వో జె.వెంకటరావు, సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, ఆర్డీఓ హేమలత, అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్‌కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు

ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కురుపాం నియోజకవర్గ కేంద్రానికి వస్తున్న సందర్భంగా బహిరంగ సభా ప్రాంతం, హెలిప్యాడ్ పరిసరాలను పోలీసులు తనిఖీ చేశారు. బాంబ్ స్క్వాడ్ బృందం నిశితంగా పరిశీలించింది. ఆయా ప్రాంతాల్లో పోలీస్ సిబ్బంది గస్తీ కాస్తున్నారు.

'జగనన్న సురక్ష'కు శ్రీకారం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జెడ్పీచైర్మన్, కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు



జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభంలో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి

కురుపాం: జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు కావలసిన సేవలు అందించాలని సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభాన్ని కురుపాం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నిషాంత్‌కుమార్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, కురుపాం, పార్వతీపురం ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, జోగారావు, టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు సి.విష్ణుచరణ్, కల్పనాకుమారి, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత, అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమ ఉద్దేశాన్ని జిల్లా అధికార యంత్రాంగానికి వివరించారు.

నేటి నుంచి 37 గ్రామాల్లో సర్వే



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జేసీ గోవిందరావు

పార్వతీపురం: జిల్లాలో జగనన్న సురక్ష పథకం తొలివిడత సర్వే 37 గ్రామాల్లో శనివారం నుంచి చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు మండల అధికారులను ఆదేశించారు. జగనన్న సురక్ష పథకం అమలుపై కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్‌లో శుక్రవారం మాట్లాడారు. కార్యక్రమం విధివిధానాలను తెలియజేశారు. జూలై 1 నుంచి మండల కమిటీ పర్యటించేందుకు షెడ్యూల్‌ను రూపొందించామని చెప్పారు. మొదటి విడతగా జూలై 1న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించే 37 గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని, వాటిని సంబంధిత యాప్‌లో నమోదు చేయాలన్నారు. ప్రజలకు అవసరమైన 11 రకాల సర్టిఫికెట్లను అందించాలన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రత్యేక ప్రశ్నావళిని అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో డుమా పీడీ కె.రామచంద్రరావు, ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

చినుకు కురిసె.. పుడమి మురిసె..



పాచిపెంట మండలం పనసపాడు వద్ద కొండపోడులో పత్తి విత్తనాలు విత్తుతున్న మహిళా రైతులు

నైరుతి రుతుపవనాల ఆగమనంతో పార్వతీపురం మన్యం జిల్లాలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ సాగుకు భూములను సిద్ధం చేసిన రైతులు పొలంబాట పట్టారు. మెట్టభూముల్లో పత్తి, మొక్కజొన్న విత్తనాలు విత్తడంలో నిమగ్నమయ్యారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 2,30,490 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణంకాగా, సుమారు 1,71,000 ఎకరాలలో వరి, 23,990 ఎకరాల్లో పత్తి, 16,488 ఎకరాల్లో మొక్కజొన్న, మిగిలిన భూమిలో ఇతర పంటల సాగుకు ఉపక్రమించారు. ఇప్పటికే ఆర్‌బీకేల ద్వారా పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సుమారు 27వేల క్వింటాళ్ల వరి విత్తనాలను సిద్ధం చేసింది. 10వేల భూసార పరీక్ష శాంపిల్స్‌ను వ్యవసాయాధికారులు సేకరించి భూసారం వివరాలను రైతులకు తెలియజేసే పనిలో నిమగ్నమయ్యారు. మరోవైపు 1,42,930 మంది రైతులకు వైఎస్సార్ రైతు భరోసా కింద ప్రభుత్వం రూ.107.19 కోట్లను పెట్టుబడి సాయంగా రైతులకు అందజేసింది. 1435 మంది రైతులకు పంట నష్టపరిహారం కింద సుమారు కోటిరూపాయలు అందించింది. వర్షాధార భూములతో పాటు పెద్దగెడ్డ, వెంగళరాయసాగర్, సువర్ణముఖి, వట్టిగెడ్డ, తోటపల్లి తదితర సాగునీటి వనరులు ఆధారంగా రైతులు పంటల సాగుకు సమాయత్తమయ్యారు. – సాలూరు

సాక్షి మీడియా గ్రూప్, ఆర్‌సీ ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త నిర్వహణలో

గ్రూప్–2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు రేపు

- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన వారికి నగదు, స్టడీ మెటీరియల్ అందజేత

విజయనగరం అర్బన్: రాష్ట్రంలో భారీ ఎత్తున గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దాదాపు వెయ్యి పోస్టుల వరకు గ్రూప్–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'సాక్షి ఎడ్యుకేషన్.కాం' రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సీ.ఎగ్జామ్స్ కలిసి ఉచిత అవగాహన సదస్సును నిర్వహిస్తోంది. పట్టణంలోని మూడులాంతర్ల జంక్షన్ సమీపాన హోటల్ ఆనంద్ గ్రేండ్ ఫోర్ట్ లో ఈ నెల 25వ తేదీ ఉదయం 9.00 గంటల నుంచి 12.30 వరకు ఈ సదస్సును చేపడుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు 'సాక్షి ఎడ్యుకేషన్.కాం' తోడుగా ఉంటున్న విషయం తెలిసిందే. త్వరలోనే వెయ్యికి పైగా గ్రూప్–2 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండటం ... దీనికి తోడు గ్రూప్–2కు కొత్త సిలబస్‌ను ప్రకటించిన నేపథ్యంలో ఈ అవగాహన సదస్సులు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడనున్నాయి. అవగాహన సదస్సు, టాలెంట్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా సెల్: 89850 94499 నంబర్‌కు తమపేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

ఉచిత అవగాహన సదస్సు తేదీ: ఈ నెల 25 (ఆదివారం)

వేదిక: హోటల్ ఆనంద్ గ్రాండ్ ఫోర్ట్, ఏ.జీ.రోడ్, మూడు లాంతర్ల జంక్షన్, విజయనగరం

సమయం: ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు

వివరాలు పంపించాల్సిన ఫోన్ నంబర్: 89850 94499

పదో తరగతి సప్లిమెంటరీలో 62.34 శాతం ఉత్తీర్ణత

విజయనగరం పూల్‌బాగ్: పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో 62.34 శాతం ఉత్తీర్ణతతో విజయనగరం జిల్లా 14వ స్థానంలో నిలిచింది. పరీక్ష ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. జిల్లా నుంచి పరీక్షకు హాజరైన 6,126 (బాలురు03,547, బాలికలు–2579) మందిలో 3,819 (బాలురు–2,100, బాలికలు–1719) మంది ఉత్తీర్ణత సాధించారు. బాలికల ఉత్తీర్ణతా శాతం 66.65 శాతంకాగా, బాలుర ఉత్తీర్ణతా శాతం 59 శాతం మొత్తం 62.34 శాతం ఉత్తీర్ణతా శాతం వచ్చింది. ఉత్తీర్ణుల జాబితా నాలుగు రోజుల్లో వెబ్‌సైట్ అందుబాటులో ఉంటుందని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు.

రీ కౌంటింగ్‌కు దరఖాస్తు చేసే విద్యార్థులు సబ్జెక్టుకు రూ.500 చొప్పున, రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసే విద్యార్థులు సబ్జెక్టుకు రూ.1000 చొప్పున సీఎఫ్ఎంఎస్‌లో చలానా రూపంలో ఫీజు చెల్లించి, అప్లికేషన్‌తో పాటు హాల్‌టిక్కెట్ జతపరచి ప్రధానోపాధ్యాయుల సంతకం చేయించి కోటలోని స్ట్రాంగ్ రూమ్‌కు ఈనెల 29లోగా అందజేయాలన్నారు. పదవతరగతి ఫలితాలు, రీకౌంటింగ్, రీ వెరిపికేషన్ అప్లికేషన్లు www.bre.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంటాయన్నారు.

క్లుప్తంగా

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు... పార్వతీపురం పట్టణం జగన్నాథపురం కాలనీ త్రినాథస్వామి గుడి సమీపంలో ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన రాగోలు గౌరీశంకరరావు, రాగోలు రాము, కె.సాయిలకు పలు చోట్ల గాయాలయ్యాయి. వీరు జగన్నాథపురానికి చెందిన వారు. గాయాల పాలైన వారిని 108 వాహనం ద్వారా పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు.

వ్యక్తి మృతి

దెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధి గొల్లపేట గ్రామానికి చెందిన నక్క రమణ(38) పురుగుల మందు సేవించి చికిత్స పొందుతూ మరణించాడు. ఎస్‌ఐ మహేష్ తెలిపిన వివరాలు.. కుటుంబ సమస్యల నేపథ్యంలో ఈ నెల 20వ తేదీన రమణ పొలంలో పురుగుల మందు సేవించాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు రమణను చికిత్స నిమిత్తం విజయనగరం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడని శుక్రవారం తెలిపారు.

ఆత్మహత్యా యత్నం


చికిత్స పొందుతున్న రాజేష్

పార్వతీపురం: ఇరుగు పొరుగు వారు కుటుంబ పరిస్థితిపై లేనిపోని మాటలు ఆడుతున్నారని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యా యత్నం చేశాడు. అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు... కొమరాడ మండలం కొండకోనేరు గ్రామానికి చెందిన బి.రాజేష్‌తో పాటు అమ్మ, చెల్లి ఒకే ఇంట్లో ఉంటున్నారు. అయితే చెల్లి ఒంటరిగా ఉండడం ఎవరి మాట వినకపోవడం, ఎటు వెళ్లినా చెప్పకపోవడం, అడిగితే చిరాకు పడడం తదితర కారణాలతో పాటు ఇరుగు పొరుగు వారు చెల్లిపై లేనిపోని మాటలు ఆడడంతో జీవితంపై విరక్తి చెందిన రాజేష్ పంట పొలాలకు వాడే పత్తి మందును శుక్రవారం తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన ఇరుగుపొరుగు వారు చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గజరాజులను కవ్వించొద్దు

● జిల్లా అటవీశాఖ అధికారి ప్రసూన


దుగ్గిలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

కొమరాడ: మండలంలోని దుగ్గి గ్రామంలో ఎనిమిది ఏనుగులు సంచరిస్తున్నాయని, వీటిని యూనిట్ ఫారెస్ట్ రేంజ్ అధికారి మణికంఠశ్వరతో పాటు ట్రేకర్స్ బృందం పర్యవేక్షిస్తుందని, ఎవరూ వాటిని కవ్వించొద్దని జిల్లా అటవీ శాఖ అధికారి జీఏపీ ప్రసూన శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అటవీ శాఖ అధికారులతో పాటు ట్రేకర్స్ క్షేత్ర స్థాయిలో ఉండాలని ప్రజలకు ఏనుగులతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అటవీ శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు ఏనుగుల సంచారంపై గ్రామస్తులకు తెలియజేయాలని సూచించారు. ఏనుగులను ఎటువంటి కవ్వింపు చర్యలకు గురి చేయొద్దని కోరారు. ఏనుగుల వల్ల నష్టపోయిన పంటలకు సంబంధించి ఇప్పటి వరకు రూ.2.17 కోట్లు పరిహారం చెల్లించనట్టు తెలిపారు. మరో రూ.28 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని కూడా త్వరలోనే చెల్లిస్తామని పేర్కొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,450-00
బంగారం(22సి. 10గ్రా.)	54,500-00
వెండి (కిలో)	75,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹250	₹ 260

పౌల్ట్రీలకు ఎదురు దెబ్బ

ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది వేసవిలో ఎండలు మండిపోవడంతో పౌల్ట్రీ దెబ్బతింది. ఫలితంగా కోడి, చికెన్ ధరలు కొండెక్కాయి. వీటి ధరలు వినియోగదారులకు చుక్కలు చూపించాయి. ఇప్పటికీ ధరలు తగ్గుముఖం పట్టలేదు.

- వేసవి తీవ్రతతో తగ్గిన ఉత్పత్తి– పెరిగిన చికెన్ ధరలు
- జిల్లా వ్యాప్తంగా 83 బ్రాయిలర్ పౌల్ట్రీ ఫారాలు
- ప్రతీ నెల 25 లక్షల కోళ్ల ఉత్పత్తి
- జూన్‌లో 22 లక్షలకు పడిపోయిన ఉత్పత్తి


కాకరాపల్లి పౌల్ట్రీ ఫామ్‌లో కోళ్లు

రాజాం : ఈ ఏడాది వేసవి ఎండలు ఇటు ప్రజలతో పాటు అటు వ్యాపారులను, రైతులను ఇబ్బందులకు గురి చేశాయి. ప్రధాన ఉత్పత్తి, లాభాదాయకమైన పౌల్ట్రీ నిర్వహణకు చుక్కలు చూపించాయి. రోజురోజుకు ఎండ తీవ్రత పెరిగి, వడగాడ్పులు వేయడంతో పౌల్ట్రీ ఫారాల నిర్వహణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆశించిన స్థాయిలో ఉత్పత్తి చేయలేక చతికిలపడ్డారు.

తగ్గిన దిగుబడి

జిల్లా వ్యాప్తంగా 83 బ్రాయిలర్ కోళ్ల పౌల్ట్రీలు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా వీటి ద్వారా 500 కుటుంబాల జీవనం సాగిస్తున్నాయి. ప్రతీ నెల పౌల్ట్రీలు ద్వారా జిల్లాలో 25 లక్షల నుంచి 27 లక్షల వరకూ కోళ్ల ఉత్పత్తి జరుగుతుంది. ఒక్కో కోడి పౌల్ట్రీకి వచ్చిన మూడు నెలల వ్యవధిలో కిలోన్నర నుంచి రెండు కిలోల వరకూ పెరుగుతుంది. అతి వెచ్చదనం కాకుండా, అతి చల్లదనం కాకుండా మధ్యస్తంగా ఉండే వాతావరణమే బ్రాయిలర్ కోళ్ల పౌల్ట్రీలకు అనుకూలంగా ఉంటాయి. సాధారణంగా వర్షాకాలంలో రకరకాల వ్యాధులు వచ్చి కోళ్లు మృత్యువాత పడుతుంటాయి. వేసవి ఎక్కువగా వీటికి అనుకూలంగా ఉంటుంది. ఈ ఏడాది మాత్రం అతి ఉష్ణోగ్రతలు, వీటికి తోడు వడగాడ్పులు పౌల్ట్రీని కుదేలు చేశాయి. పౌల్ట్రీకి వచ్చిన కోడి పిల్లలు పరిణితి చెందకముందే ఎండ తీవ్రతకు మృత్యువాత పడుతుండేవి. ఫలితంగా మే నెలలో జిల్లాలో కోళ్ల ఉత్పత్తి పడిపోయింది. 22 లక్షల కోళ్ల మాత్రమే ఉత్పత్తి జరిగింది.

చికెన్‌పై ప్రభావం

పౌల్ట్రీ కోళ్ల మృతి చెందడంతో ఈ ప్రభావం చికెన్ ధరలపై పడింది. ఏప్రిల్ నెల వరకూ కిలో చికెన్ ధర రూ.200 నుంచి రూ.240లు మధ్య కొనసాగేది. మే నెల చివరినాటికి కిలో చికెన్ ధర రూ.280లు నుంచి రూ.300లకు చేరుకుంది. కోడి ధర కిలో రూ.180లకు పెరిగింది. జిల్లా వ్యాప్తంగా మాంసాహారులు అధికంగా ఉండడంతో పాటు వేసవిలో ఎక్కువగా కార్యక్రమాలు జరగడం కారణంగా వీటి ధర పెరగడం ఒక ఎత్తు కాగా, ఉభయ గోదావరి జిల్లాలు నుంచి దిగుమతి కూడా జిల్లాలో అధికమైంది. ప్రస్తుతం వేసవి తీవ్రత తగ్గుముఖం పట్టడంతో వచ్చే నెలనాటికి పౌల్ట్రీలు ద్వారా కోళ్ల ఉత్పత్తి పెరిగే అవకాశాలు ఉన్నాయని రైతులు వెల్లడిస్తున్నారు.

ఉత్పత్తి తగ్గింది



మా వద్ద మూడు పౌల్ట్రీ షెడ్లు ఉన్నాయి. ఈ ఏడాది వేసవిలో భారీగా ఉత్పత్తి పడిపోయింది. ఒక టర్మ్‌కు 1500 కోళ్ల ఉత్పత్తి ఉండేది. ఈ దఫా 1200 కోళ్ల మాత్రమే ఉత్పత్తి అయ్యాయి. వేసవి తీవ్రతకు చాలా కోళ్లు చనిపోయాయి. ధర మాత్రం పెరిగింది. – చాపల పాపారావు, పౌల్ట్రీ యజమాని, కాకరాపల్లి, సంతకవిటి మండలం

వేసవి ఎఫెక్ట్..



ఈ ఏడాది వేసవి ఎఫెక్ట్ బాగా తగిలింది. చికెన్‌పై ఈ ప్రభావం చూపించింది. పౌల్ట్రీ నిర్వాహకులకు వేసవి అనుకూలించలేదు. ఫలితంగా బ్రాయిలర్ కోళ్ల ఉత్పత్తి తగ్గిపోయింది. కోళ్లు పెరగక కూడా సాధారణ రోజులు కంటే తక్కువగా కనిపించింది. వచ్చే నెలలో ఈ ఉత్పత్తులు మళ్లీ పెరుగుతాయి. – బొత్స జయప్రకాష్, ఏడీఏ, పశు సంవర్థక శాఖ, రాజాం

సంపూర్ణ సంక్షేమ దీక్ష – ‘జగనన్న సురక్ష’

● వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ డీవీజీ


డాక్టర్ డీవీజీ శంకరరావు

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం ఒక ఉత్తమమైన ఆలోచన అని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ జోనల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ డీవీజీ శంకరరావు శుక్రవారం పేర్కొన్నారు. ప్రజలకు సంక్షేమం అందించడంలో నెలకొల్పిన కొత్త ఒరవడిగా వాఖ్యానించారు. సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా చూడడం గొప్ప ప్రయత్నంగా తెలిపారు. అనర్హులకు పథకాలు అందినా ఫరవాలేదు కానీ ఒక్క అర్హుడికి కూడా ఏ పథకమూ దూరం కారాదన్నది మానవీయ ఆలోచనగా కొనియాడారు. సాధారణంగా ఏ పథకాలైనా డెబ్బై శాతం విజయవంతం అయితే పూర్తి విజయంగా లెక్కలు వేస్తారని, మిగతా ముప్పై శాతం వైఫల్యాన్ని కప్పి పుచ్చేస్తారని.. దానివల్ల పేరు గొప్ప పథకాలు కూడా వాస్తవానికి పూర్తిగా న్యాయం చేయకుండా పోతున్నాయన్నారు. అర్హులైన లబ్ధిదారులు వాటి కోసం పోరాడే శక్తివంతులు కాకపోవడమే ప్రధాన కారణంగా తెలిపారు. అమలు చేయాల్సిన వారు మరింత కష్టపడి అందని వారిని చేర్చుకోవాలన్న చిత్తశుద్ధి చూపించటం లేదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ విషయంలో లబ్ధిదారుల వైపు నుండి ఆలోచించబట్టే ఇంత మంచి కార్యక్రమం వాస్తవ రూపం దాల్చబోతోందన్నారు. సంక్షేమ పథకాల అమలులో అదీ నేరుగా పారదర్శకంగా అందించడంలో 99.5 శాతం విజయవంతమైనట్టు గణాంకాలు చెబుతున్నా 100 శాతం లబ్ధిదారులకు న్యాయం చేయాలన్న వైఖరితో ముందుకు వెళ్తున్నారని వివరించారు. రానున్న 15 రోజుల్లో ప్రతీ ఇంటికీ వెళ్లి సచివాలయాలతో సమన్వయం చేసుకుని వారి సమస్యల పరిష్కారానికి పూనుకొంటారని ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి కలెక్టర్ మొదలుకొని, ముఖ్యమంత్రి కార్యాలయం వరకూ ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందన్నారు. సంక్షేమం అందించడం కేవలం బాధ్యతగా తలచకుండా పవిత్ర యజ్ఞంలా భావించే ఈ కార్యక్రమం మిగతా రాష్ట్రాలకు మార్గదర్శిగా నిలుస్తుందన్నారు.

వర్చువల్ తనిఖీలు సరికాదు...

● ఏపీటీపీఐఈఏ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ విజయనగరం గురజాడ (జీవీ) యూనివర్సిటీ అనుమతి అర్హత కోసం అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో చేపడుతున్న వర్చువల్ తనిఖీల (ఎఫ్ఎఫ్‌సీ) విధానాన్ని విరమించుకోవాలని, తనిఖీలు ఆఫ్‌లైన్‌లోనే జరగాలని ఏపీటీపీఐఈఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎంవీ బ్రహ్మానందరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అనుబంధ కళాశాలల తనిఖీ విధానం వర్చువల్‌గా ఇటీవల యూనివర్సిటీ ప్రకటించిందని ఈ విధానం వల్ల కళాశాల యాజమాన్యాలు ఏ మాత్రం పారదర్శకం పాటించడానికి వీలుపడదని పేర్కొన్నారు. అదే విధంగా ఈ విధానం వల్ల అవినీతికి పాల్పడే అవకాశాలు అధికంగా ఉన్నాయని ఆరోపించారు. ఉన్నత విద్యా విధానాన్ని రాష్ట్రంలో గాడిలో పెట్టాల్సిన బాధ్యత యూనివర్సిటీ అధికారులకు ఉందని జేఎన్‌టీయూ జీవీ అమలు చేస్తున్న ఈ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మృతుడు సూర్యారావు(ఫైల్)

భోగాపురం: విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ అక్కివరపు సూర్యారావు(40) మృతి చెందిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని జగ్గయ్యపేట గ్రామానికి చెందిన అక్కివరపు సూర్యారావు ప్రైవేటు ఎలక్ట్రికల్ మరియు ప్లంబింగ్ పనులు చేసుకుంటూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 16న ఇదే గ్రామానికి చెందిన చేట్ల సూరిబాబు పొలంలో మోటారు పని చేయడం లేదని, రిపేర్ చేయమని సూర్యారావు ఇంటికి వచ్చాడు. దీంతో సూర్యారావు ముంజేరులో ఉన్న తన హెల్పర్ నారాయణరావును తీసుకుని సూరిబాబు పొలం వద్దకు వెళ్లాడు. అక్కడ ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి కింద పడిపోయాడు. హెల్పర్ నారాయణరావు ద్వారా సమాచారం తెలుసుకున్న సూర్యారావు కుమారుడు ప్రసాద్, భార్య బంగారమ్మ సంఘటన స్థలానికి చేరుకున్నారు. కాలిన గాయాలతో పడి ఉన్న భర్తను వెంటనే విజయనగరం తిరుమల ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం సూర్యారావు మృతి చెందాడు. మృతుని భార్య బంగారమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు.

పొదుపు సంఘాల సభ్యుల అభివృద్ధికి చర్యలు

● డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి

విజయనగరం అర్బన్: గ్రామాల్లోని మహిళా పొదుపు సంఘాల సభ్యుల ఆర్థికాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ కళ్యాణ చక్రవర్తి అన్నారు. స్థానిక టీటీడీసీ మహిళా ప్రాంగణంలో మండల సమాఖ్య అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మండల సమాఖ్య పాలక వర్గం విధులు, బాధ్యతలపై శుక్రవారం నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమానికి ఆ యన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యులు ఆర్థిక క్రమశిక్షణ కలిగి ఉండాలని సూచించారు. ఈ దిశగా మండల సమాఖ్యలు అభివృద్ధిలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు పథక సంచాలకులు, డీపీఎం, ఐబీ, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


మజ్జి తోగులురెడ్డి (ఫైల్)

భోగాపురం: భార్య మందలించిదని మనస్తాపంతో పురుగుల మందు తాగి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం ఉదయం మండలంలోని కొత్తచెరుకుపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తచెరుకుపల్లి గ్రామానికి చెందిన మజ్జి తోగులురెడ్డి(52) ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తూ కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య నరసయ్యమ్మ, కుమారుడు ఆదిబాబు ఉన్నారు. ఇటీవల తోగులురెడ్డి మద్యానికి బానిసై వచ్చిన జీతం డబ్బులను ఇంటికి ఇవ్వకుండా రోజు మద్యం సేవించి భార్యతో గొడవకు దిగేవాడు. ప్రతిరోజు లాగే గురువారం కూడా మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యతో గొడవకు దిగాడు. దీంతో భార్య నరసయ్యమ్మ తన కుమారుడుని తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. మరుసటి రోజు ఉదయం తోగులురెడ్డి ఇంటి నుంచి దుర్వాసన రావడంతో పక్క ఇంట్లో ఉన్న మజ్జి శ్రీనివాసుకు అనుమానం వచ్చి తలపులు తెరచి చూసేసరికి తోగులురెడ్డి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఫోన్ ద్వారా వెంటనే తోగులురెడ్డి కుమారుడు ఆదిబాబుకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న ఆదిబాబు తల్లి నరసయ్యమ్మతో కలిసి ఇంటికి చేరుకున్నాడు. అప్పటికే తోగులురెడ్డి మృతి చెందాడు. కుమారుడు ఆదిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సూర్యకుమారి తెలిపారు.

కలెక్టరేట్ ఎదుట గెస్ట్ టీచర్ల నిరసన


కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శనలో కేజీబీవీ గెస్ట్ టీచర్లు

విజయనగరం అర్బన్: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో (కేజీబీవీల) కొన్నేళ్లుగా గెస్ట్ టీచర్లుగా కొనసాగుతున్న టీచర్లను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కేజీబీవీ టీచర్లు మాట్లాడుతూ వేతనాలు తక్కువ ఇచ్చినా టీచింగ్ వృత్తిగా చేసుకొని కేజీబీవీల్లో పని చేస్తున్నామని అర్థంతరంగా తొలగించడం వల్ల కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వకుండా ఇటీవల వచ్చిన కొత్త వారిని తీసుకొనే భర్తీ నోటిఫికేషన్‌ను, ఆ నోటిఫికేషన్ ద్వారా చేపట్టిన ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీలు చేస్తున్న న్యాయ పోరాటానికి ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీఐటీయూ సంఘాలు మద్దతు తెలిపాయి.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల నిరసన



నిరసన తెలియజేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

రాజాం సిటీ: నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆదర్శనగర్ అర్బన్ పీహెచ్‌సీ ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర కోశాధికారి జె.సింహాచలం మాట్లాడుతూ ప్రభుత్వం సమాన పనికి సమాన వేతనం, ఎంటీఎస్‌ను అమలు చేయాలని కోరారు. డిమాండ్ల సాధనకు జూలై 10న తాడేపల్లిలో నిర్వహించనున్న ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రషణార బేగం, సిబ్బంది సునీతదేవి, శాంతి, రాంబాబు, సంతోషికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆటో చోదకులపై కేసులు

పాలకొండ రూరల్: మితిమీరిన వేగం, అధిక లోడుతో నిబంధనలు అతిక్రమించిన ఆటో చోదకులపై కేసులు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. పాలకొండ – సీతంపేట రహదారిలో వాహనాలను శుక్రవారం తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్సులు లేని వారికి అపరాధ రుసుం విధించారు. వాహన చోదకులు నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గొలుసు దొంగ అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు (వెనుక ముసుగులో నిందితురాలు)

విజయనగరం క్రైమ్: హ్యాండ్ బ్యాగ్‌లో ఉంచిన ఆరు తులాల బంగారు గొలుసును దొంగతనం చేసిన మహిళను వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలు... ఉడా కాలనీ ఫేజ్ –4లో నివాసం ఉంటున్న పెంట విజయలక్ష్మి స్థానిక కన్యక పరమేశ్వరీ ఆలయం వద్ద ఆటో ఎక్కి మార్గమధ్యలోకి వచ్చేసరికి తన హ్యాండ్ బ్యాగ్ చెక్ చేసుకునే సరికి తన బ్యాగ్‌లో ఉన్న ఆరు తులాల బంగారు గొలుసు దొంగలించబడిందని గుర్తించింది. వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఉల్లి వీధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న దాసు యేసుమణి అనే మహిళను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు ఆమె అంగీకరించిందన్నారు. ఆమె నుంచి ఆరు తులాల బంగారు గొలుసును రికవరీ చేసి, నిందితురాలని అరెస్ట్ చేశామన్నారు. సమావేశంలో వన్‌టౌన్ ఎస్‌ఐ అశోక్ కుమార్, హెచ్‌సీ అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

25న ఒలింపిక్ డే రన్


ఒలింపిక్ డే రన్‌కు సంబంధించిన టీ షర్టులు ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయనగరం: అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న విజయనగరం జిల్లా కేంద్రంలో 2కే రన్ నిర్వహించనున్నట్లు జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు గురాన అయ్యలు, ఉపాధ్యక్షుడు సుభాష్‌చంద్రబోష్ వెల్లడించారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఒలింపిక్ డే రన్‌కు సంబంధించిన టీ షర్టులను, టోపీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ రోజు నగరంలోని రాజీవ్ స్టేడియం నుంచి ప్రారంభమయ్యే రన్ కార్పొరేషన్ కార్యాలయం జంక్షన్, గంటస్తంభం జంక్షన్, మెయిన్ రోడ్, మూడులాంతర్ల జంక్షన్, డీసీసీబీ రోడ్ మీదుగా కోట జంక్షన్ వరకు సాగుతుందన్నారు. ఈ ర్యాలీని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీలు డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, ఇందుకూరి రఘురాజు, పి.రఘువర్మ, విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు నగరంలో ఒలింపిక్ డే రన్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యమే మహాభాగ్యమన్న స్ఫూర్తితో ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ రన్‌ను నిర్వహించటం జరుగుతుందన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనంతో పాటు ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు క్రీడల్లో పిల్లలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి సిహెచ్.వేణుగోపాలరావు, కోశాధికారి నడిపిల్లి గురునాథ్, రెజ్లింగ్ అసోసియేసన్ రాష్ట్ర కార్యదర్శి రమణ, హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మల్లిబాబు, దుర్గాప్రసాద్, అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు లీలాకృష్ణ, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

● డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రవీంద్రనాథ్


జీఆర్.రవీంద్రనాథ్

విజయనగరం టౌన్: రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా ఉప రవాణాశాఖ అధికారులు పని చేస్తున్నారని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జీఆర్. రవీంద్రనాథ్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏడాదిలో రోడ్డు ప్రమాదాల సంఖ్యను కనీసం పది శాతానికైనా తగ్గించాలనే లక్ష్యంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. పాఠశాలలకు, కళాశాలలకు విద్యార్థులను తీసుకువెళ్లే బస్సులు, ఆటోలు, క్యాబ్‌ల డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ అందజేస్తామన్నారు. ఇందు కోసం ఆయా కళాశాలల్లోనే శిక్షణా తరగతులు కూడా నిర్వహిస్తామన్నారు. ఎల్ఎల్ఆర్, డీఎల్‌కి వచ్చే అభ్యర్థులకు ఆడియో, వీడియో విజువల్స్ తరగతులు నిర్వహించి, అవగాహన కల్పిస్తామన్నారు. అన్ని శాఖలతో కలిసి ప్రతి మూడు నెలలకొకసారి రోడ్డు ప్రమాదాల నివారణపై సమావేశం నిర్వహించి, బ్లాక్ స్పాట్స్ గుర్తించి, ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. నగర పరిధిలో నాలుగువేల ఆటోలు తిరుగుతున్నాయని, వాటిలో మహిళల రక్షణకు వినియోగించే అభయం యాప్‌ను ఇప్పటివరకూ 1780 వరకూ ఇన్‌స్టాల్ చేశామన్నారు. ఇప్పటివరకూ ఆటో, క్యాబ్ డ్రైవర్లకు వైఎస్సార్ వాహన మిత్ర పథకం ద్వారా 2022 – 23 సంవత్సరానికిగానూ 13వేల 830 మందికి ఒక్కొక్కరికీ రూ. 10వేలు చొప్పున రూ. 138 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందజేశామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

ADMISSIONS
■ ఉచిత విద్య, ఉచిత వసతి SC, ST, BC, మైనార్టీ విద్యార్థులకు ANM,GNM, అనస్థీషియా, రేడియోగ్రఫి,OT,మెడికల్ ఇమేజింగ్,DMLT,మేల్ నర్సింగ్ కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి. 8885999144 [G-245]

ADMISSIONS
■ NRR వ్యవసాయ పాలిటెక్నిక్, నెలివర్తి, సాలూరు మండలం, వ్యవసాయ మరియు సీడ్ టెక్నాలజీలో డిప్లొమా కోర్సుల కొరకు దరఖాస్తులు కోరబడుచున్నవి. సంప్ర : 91826 39173, 79815 98164 [V- 1959]

PLOT FOR SALE
■ కేవలం 6.5 లక్షలకే 117గ॥ స్థలంలిత్ రిజిస్ట్రేషన్ అప్రూవుడ్ లేవుట్ హిల్ వ్యూ అలాగే ప్రహరి గోడ 30ఫీట్ పర్ బ్లాక్ టాప్ రోడ్స్ ఒపెన్ డ్రైన్స్ వెంటనే ఇల్లు కట్టుకోవడానికి అనువుగా మరియు ఆహ్లాదకరమైన వాతావరణం విజయనగరానికి అతి సమీపంలో, సెల్.9143143818 [S- 1195511]

■ Plot For Sale Near Bhogapuram
Plot No. E-182 166 Sq.yds Kohinoor Gateway Executives VUDA Approved Layout Developed by Building Blocks Bantupally Village. Ph : 77020 01857, 77299 33106 [V-1957]

FLAT FOR SALE
■ 2 B/R Flat Car Parking Loan Can be arranged 100% Vastu @ R&B Guest House Road, Alakananda Colony, VZM. Cont : 92466 24248, 98494 73817 [V-797204]

HOUSE FOR SALE
■ Vizianagaram JNTU Jn., 33.3x60, 222 గ॥ E/F 3 Bedroom Individual House for Sale. Rate: 80 Lakhs, Full Residential area, Vastu & Bank Loan available ✆ 9000763328. [C-785885]

ASTROLOGY
■ శ్రీ గాయత్రి జోతిష్యం : విద్య, ఉద్యోగం, సంతాన దోషం, ఆరోగ్యం, వ్యాపారం, ప్రేమ, పెళ్లి సమస్యలు, కుటుంబ సమస్యలు, వాస్తు దోషం, కుజ దోషం, నాగదోషం మరియు నరగోష పీడ ఎటువంటి సమస్యలకైనా శాస్వత పరిష్కారము చూపబడున. భాష్యం స్కూల్ ఎదురుగా, విజయనగరం. ఫోన్ : 97017 78711 [V- 1651]

BUSINESS OFFER
■ ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 9034424384 [H-189201]

MINI GEEZER
■ శ్రీ గాయత్రి మినీ గీజర్స్ (5 sec.లో వేడి నీళ్ళు) సేల్స్ చేయుటకు డీలర్స్ కావలెను. తక్కువ పెట్టుబడి, ఎక్కువ లాభం. సంప్ర. సెల్ : 96663 32323, 95506 92836. [M-1221206]

WANTED
■ కుక్, హెల్పర్, తోటి, ఆయమ్మలు, వార్డెన్స్ (స్త్రీలు మరియు పురుషులు) కావలెను. కాంటాక్ట్ నెం.94413 06144. [S-1195878]

■ భారత్ బ్యాంకులో టెలికాలర్స్‌గా పనిచేయుటకు తెలుగులో ధారాళంగా మాట్లాడగల 10వ తరగతి చదివిన 23సం॥ లోపు యువతీలు కావలెను. ఫోన్ : 98855 52945 [V-794567]

■ మా కంపెనీలో పనిచేయడానికి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. మీ మండలంలో ఉంటూ మా కంపెనీ గురించి మార్కెటింగ్ చేయాలి. జీతం: 12–15వేలు, ఇన్సెంటివ్, ఇన్సూరెన్స్ కలవు. అర్హత: ఇంటర్మీడియట్. 8381848549 [G-824]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K హైదరాబాద్ : 9640258899, విజయవాడ: 9640648899 [HA-337]

■ మా సంస్థను మీ జిల్లాలో అభివృద్ధి చేయుటకు మార్కెటింగ్ ఫీల్డ్‌లో అనుభవమున్న వారు కావలెను. Mega Group Manpower & Security. Cell : 70326 10569, 70931 25169. [HA-5711]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.